# అంతరాత్మా! నీకు జోహార్లు

గంపల నరసింహారెడ్డి



ఆ రోజు డాక్టరు రావుగారిల్లు పెళ్లి కూతుర్లా కళకళ్లాడుతూ ఉంది. డాక్టరు రావు ఆ చిన్న పట్టణంలో పెద్ద డాక్టరు. అతడు చేయి పట్టుకుంటేనే — సమస్త రోగాలు నయమైపోతాయనే నమ్మకం ఆ ఊర్లోనే కాదు చుట్టు ప్రక్కల ఊర్లలోనూ ఉంది. అందుకే అతని ప్రైవేటు క్లినిక్ దగ్గర జనం తిరునాళ్లలా ఉంటారు. అతను ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్నట్లు చాలా మందికి తెలియదు.

ఆనాడు సాయంత్రం డాక్టరు రావు ఆ పురప్రముఖులకు పార్టీ ఇవ్వబోతున్నాడు. అందుకే ఏర్పాట్లకై ఆ ఇంటిలోని వారు సందడిగా ఉన్నారు. ఎవరి పనుల్లో వారు నిమగ్నమై ఉన్నారు.

అప్పుడు మధ్యాహ్నం కావస్తుంది.

ఆ సమయంలో, ఆ మండుటెండలో ఆ ఇంటి గేటు దగ్గరికి వచ్చింది సెంద్రి. సెంద్రి ఎలా ఉందంటే —

అడుక్కు తినేదానిలా ఉంది. అందులో ఆశ్చర్యం ఏమీలేదు.

ఎందుకంటె -

డాక్టరుగారి భార్య అడుక్కు తినేదానిలా కనిపిస్తే ఆశ్చర్యం. అలాగే అడుక్కు తినేది అడుక్కు తినేదానిలానే కనిపిస్తే ఆశ్చర్యం ఏం లేదు. అందుకే సెంద్రి అలానే కనిపిస్తుంది.

అది కట్టుకున్న చీర, చీరలా లేదు. బట్ట పేలికల్ని ఒంటికి చుట్టుకున్నట్లుంది.

అయ్యో - సెంద్రికి సిగ్గేయటంలేదూ- లేదు.

ఎందుకంటే సెంద్రికి కొత్త చీరా, ఎక్కడా చినగని చీరా కట్టుకున్నప్పుడే సిగ్గేస్తుంది. అలాగే అది దాని భుజానికి జోలెను కాకుండా వ్యానిటీ బ్యాగును తగిలించుకున్నప్పుడు, దాని చేతిలో సత్తు గిన్నెకు బదులు స్టెయిన్ లెస్ స్టీలు కారియర్ పట్టుకున్నప్పుడు మాత్రం సిగ్గుపడుతుంది.

ఎడమ చంకలో పిల్లాన్ని ఎత్తుకుంది. వాడికి మూడేళ్ల వయసున్నా ఏడాది వాడిలానే ఉన్నాడు. వాడు తల్లి కంటె ఓ అడుగు ముందుకేసి పూర్తి దిగంబరంగా ఉన్నాడు.

సెంద్రి ఈ పెద్ద ఊరుకు కొత్తగా వచ్చింది. ఏ ఇంటికి ఏ సమయంలో వెళ్తే ఎటువంటి మర్యాద జరుగుతుందనే విషయం దానికింకా తెలియదు.

డాక్టరు రావు ఇంటి గేటు తీసేఉంది.

తను ఇక్కడి నుండి పిలిచినా లాభం లేదని తెలిసి కూడా అనవాయితీగా "అమ్మగారూ" అంటూ అరచింది.

ఊహూఁ- ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎలా పట్టించుకుంటారు ఎవరి పనుల బిజీలో వారుంటే?

బితుకుబితుకు మంటూనే లోపలికి అడుగుపెట్టింది. నిజానికి అలా ధైర్యం చేసి సెంద్రి గేటుదాటి లోపలికి వెళ్లి ఉండేదే కాదు. కాని ఏం చేస్తుంది? దాని కడుపులో ఖాళీ, కొడుకు కడుపులో ఖాళీ, జోలెలో రెట్టింపు ఖాళీ, సత్తు గిన్నెలో సగం ఖాళీ. అందుకే ధైర్యం చేయక తప్పలేదు. లేకుంటే ఈ రోజు పస్తులే.

గేటు నుంచి ఇంటివరకున్న బాట కిరువైపులా రకరకాల పూలచెట్లున్నాయి. అన్ని రకాల క్రోటన్సు ఉన్నాయి.

నేరుగా పోర్టికో క్రిందికి వెళ్లింది సెంద్రి. అక్కడి నుండి వరండా పైకి మెట్లున్నాయి. అక్కడే కట్టివేయబడి వుంది- ఓ కుక్క. కుక్కేనా అది? ఏమో? మొదట దాన్ని చూసి సెంద్రి చిరుతపులేమో అనుకొని ఒక అడుగు వెనక్కేసింది. అది కట్టేసుందని గ్రహించాక ధైర్యం వచ్చింది.

ఆ కుక్క పేరు డాన్!

అది ఈ మధ్యనే నీళ్ల త్రాగటం మాని తన యజమానిలా బీరు సిప్ చేయడం నేర్చుకుంది. అన్ని కుక్కలు నాన్-వెజిటేరియన్‌లు అయితే అది వీర నాన్-వెజిటేరియన్. దానికి బిస్కట్లు వెగటుపుట్టి మాంసం ముక్కలయితేనే ముట్టుకుంటుంది.

డాన్‌కు తీరని కోరిక ఒకటుంది. అది ఏంటంటే వెరీ సింపుల్- ఎవర్నైనా కరవడం! అది ఎప్పుడూ కట్టేసే ఉండటంవల్ల దానికి ఎన్నడూ కరచే చాన్సు రాలేదు.

"అమ్మా, ఇంత అన్నం పెట్టు తల్లీ!" అరచింది సెంద్రి.

"ఏంటి గోల, వెళ్ల వెళ్లు" అంటూ అటువైపు నుంచి వెళ్తున్న ఒక వ్యక్తి కసిరాడు. ఎవరి గోల వారిది మరి. సెంద్రిది ఆకలి గోల అయితే డాక్టరు రావుది ఆర్భాటం గోల.

అయినా ఆశ చావలేదు సెంద్రికి. కొడుకు నెత్తుకొని భుజం గుంజుతుండటంతో వాడిని కిందికి దించింది. తరువాత వరండాలోని దేశనాయకుల బొమ్మలను,

ప్రకృతి దృశ్యాలను, ఖరీదైన సోఫాలను చూస్తూ తను వొచ్చిన విషయమే మరచిపోయింది.

ఈ లోగా క్రిందికి దిగిన సెంద్రి కొడుకుకు కుక్క ముద్దుగా అనిపించింది. భయమనేది వాడికింకా తెలియదు. వాడెప్పుడూ ఇంటి దగ్గర వీధి కుక్కలతో ఆడుకుంటూ ఉంటాడు. అందుకే అలవాటు ప్రకారం వాడు అప్రయత్నంగా డాన్‌వైపు అడుగులేశాడు.

ఆ పిల్లాన్ని తన అందుబాటులోకి రానిచ్చి ఉత్సాహంగా ముందుకు దూకింది డాన్. చిన్న పిల్లాడు కదా చిన్నగానే కరుద్దామనుకుంది కాని బలిష్టమైన దాని పళ్లు అందుకు ఒప్పుకోలేదు.

కొడుకు గయ్యిన రాగం తీసేసరికి సెంద్రి అదిరిపడి ప్రక్కకు చూసింది. కొడుకు కాలుకు కొంతమేర కండ ఊడి రక్తం కారుతుంది. సెంద్రి కూడా పెద్దగా ఏడ్వసాగింది.

ఏడ్పులు విని ఇంటిలోని వారంతా బయటకు పరిగెత్తుకొచ్చారు. "ఏమైంది" అడిగారెవరో, అందరికీ అయిందేమిటో తెలుస్తూనే ఉంది.

"నా ఒక్కగా నొక్క చంటాన్ని మీ కుక్క కరచిందయ్యా" ఏడ్చుతూనే చెప్పింది.

"కరచిందంటే కరవదు మరి, నీవు గేటు దాటి లోపలి కెందుకొచ్చావ్?" అవునన్నట్లు అందరూ తలలూపారు.

డాక్టరు రావు కొడుకు పదేళ్లవాడికి భలే సంతోషమయింది. తమ డాన్ ఇన్నాళ్లకు ఒకన్ని కరచినందుకు. "వెరీ గుడ్ డాన్" అంటూ దాన్ని నిమిరి "ఎక్కువ మాట్లాడావంటే మళ్లీ కరిపిస్తాను" అన్నాడు, ఒకవేళ అది కరవక పోయినా తనే కరుస్తానన్నట్లుగా ఫోజు పెట్టి.

అందరూ నవ్వారు. అంత మంది నవ్వినా సెంద్రి, దాని కొడుకు తమ ఏడుపు మానలేదు.

"బయట 'కుక్కలున్నాయి జాగ్రత్త' అనే బోర్డు చూడలేదూ? ఎందుకొచ్చావ్ లోపలికి" చిరాకుగా విసుక్కున్నాడు డాక్టరు రావు.

సెంద్రికి చదువురాదు. రాకపోవడం దాని తప్పుకాదు. చదువక పోవడమే దాని జన్మ హక్కు మరి.

"ఇటువంటి వాళ్లు ఎవరూలేనిది చూసి ఏదయినా ఎత్తుకుపోవాలని చూస్తారు" మిసెస్ రావు ఓ స్టేట్‌మెంట్ ఇచ్చింది.

"కాదమ్మా, నేనలాంటిదాన్ని కాను. అన్నం కోసమే వచ్చాను" వణుకుతూ చెప్పింది.

"వీళ్లను ఊరికే వదలొద్దు. పోలీసులను పిలవండి. ఈ గొడవంతా వాళ్లే చూసుకుంటారు" డాక్టరు రావు బావమరిది ఉచిత సలహా వెలిబుచ్చాడు.

పోలీసులనగానే సెంద్రికి గుండెలు గుబగుబలాడినవి. చిన్నప్పుడు నుంచ

యినా దానికి పోలీసులంటే విపరీత భయం. తను చిన్నగా ఉన్నప్పుడూ పోలీసులొచ్చి తన తండ్రిని గుడిసె లోంచి బయటకు లాగి అనవసరంగానే చితకబాదిన దృశ్యం సెంద్రి మనసు లోంచి ఇంకా చెదిరిపోలేదు. ఈ మధ్య దానికి పోలీసుల్ని తలుచుకుంటే నిద్ర కూడా రావడం లేదు. సరిగ్గా ఆరునెలల క్రితమే దాని మొగున్ని దొంగతనం కేసు మీద పట్టుకెళ్లారు. ఇంతవరకూ వాని జాడలేదు. చచ్చిపోయుంటాడని చాలామంది దానితో అన్నారు.

"బుద్ధి తక్కువయి వచ్చినందుకు నాకు బానే సాస్తి జరిగిందమ్మా. నేనీ ఊరుకు కొత్తగా వచ్చిన. నాకేం తెలువదు తల్లీ, నేను పోతాను" అంటూ ఏడ్చుతూనే కొడుకు నెత్తుకొని బయటకు నడచింది సెంద్రి.

నవ్వుకుంటూ ఇంట్లోకి నడిచారు డాక్టరు రావు కుటుంబం.

* * *

అదేరోజు - సమయం సాయంత్రం ఆరు కావస్తుంది. డాక్టరు రావు ఇంట్లోని వారంతా వచ్చిన అతిథులను ఆదరించ డంలో, వారికి సేవచేయడంలో బిజీగా ఉన్నారు. బుడ్డీలు ఖాళీ కావస్తున్నాయి. చికెన్ ప్లేటల్లో బొమికెలే మిగిలాయి.

ఆ సమయంలో డాక్టరు రావు వంశో ద్ధారకుడు శరత్ ఇంటి ముందున్న ఆవరణలో బంతి ఆట ఆడుకుంటున్నాడు.

డాక్టరు రావు ఇంటి ముందు ఓ చెట్టుంది. ఆ చెట్టు క్రింద ఓ బక్క చిక్కిన గజ్జి కుక్క ఉంది. అది ఎల్లప్పుడూ ముడుచుకొని పడుకొని ఉంటుంది.

శరత్ ఆడుకుంటున్న బంతి గేటుదాటి వచ్చి చెట్టు క్రింది కుక్కకు దగ్గరగా పడింది. బంతివెంటనే పరిగెత్తుకొచ్చిన వాడు కుక్కకు కొంచెం దూరంగా ఆగిపోయాడు. వాడికి కుక్కకు అంత దగ్గరగా వెళ్లాలంటే భయమనిపించింది. అందుకే వాడు "ఏయ్ కుక్కా, లే" అంటూ అరిచాడు.

అది ఒక్కసారి బరువుగా కళ్లెత్తి చూసి మళ్లీ మూసుకుంది. వాడికి కోపం వచ్చింది. అటూ ఇటూ వెతికి చేతి నిండైన రాయిని తీసుకొని కుక్కకేసి బలంగా విసిరాడు.

దానికి బాధతో అరవడానికి కూడా చేత కాలేదు. సరిగ్గా రాయి ఖాళీకడుపుపై తగిలింది. పేగు తెగినంత బాధ. ప్రాణం పోయినంత పనయింది. అంత చిన్న పిల్లవానికికూడా లోకువయ్యానా అను కుంది. వానిపై అంతులేని కోపం వచ్చింది. కాని ఏంచేయగలదు. అందుకే నిస్సహాయంగా అలాగే పడుకుంది.

ఇప్పుడు శరత్‌కు ఆ కుక్కంటే భయం తొలగిపోయింది. అది ఏం చేయ లేదని తెలిసిపోయింది. అందుకే మెల్లిగా

దాని దగ్గరగా వెళ్లి వంగి బంతిని అందుకో బోతున్నాడు.

ఆ బక్కచిక్కిన గజ్జికుక్క తన ఒంట్లో ఉన్న శక్తినంతా కూడదీసుకొని, ప్రతీకారం చేసే అవకాశం వచ్చింది కదా అని మెడ ముందుకు సాపి వాడి చేయిని అందుకొని బలంగా, కసిగా కరచింది. అయినా వాడిచేయిపై దాని పంటిగుర్తులు మాత్రమే పడ్డాయి.

కెవ్వున అరచాడు వాడు.

అప్పుడే అటువైపునుండి వెళ్తున్న డాక్టరు రావు కారు డ్రైవరు పెద్ద బండ రాయిని ఎత్తి దానిపై వేశాడు. తల పగిలి ఒక్క క్షణంలోనే తృప్తిగా కళ్లు మూసింది బక్కచిక్కిన గజ్జికుక్క.

పిల్లాడి రాగాలాపనతో పార్టీ అర్ధాంతరంగా ముగిసింది. అతిథిదేవుళ్లందరూ రకరకాల వ్యాఖ్యానాలు చేయసాగారు.

"ఈ వీధి కుక్కల్ని కాల్చిపారేయాలండి."

"ఫారెన్‌లో ఇలా వీధుల్లో కుక్కలుండవండి."

"డాక్టరుగారూ, ఇప్పుడే చేర్మన్‌గారికి ఫోన్‌చేయండి. రేపటిలోగా ఈ కుక్కలన్నింటిని పట్టుకెళ్ళమని."

ఈలోగా డాక్టరు రావు కొడుకుకు ప్రథమచికిత్స చేశాడు. అతనికి తెలుస్తూనే ఉంది అదేమంత పెద్ద గాయం కాదని. కాని ఆ కుక్క పిచ్చిదేమో అనే అనుమానం అతన్ని భయకంపితున్ని చేసింది.

అతిథులందరూ వెళ్లిపోతున్నారు "విష్ యూ స్పీడీ రికవరీ మై బోయ్" అంటూ.

ఎనిమిది గంటలు దాటింది. ఇంకా శరత్ ఏడ్చుతూనే ఉన్నాడు. భయంతోనూ, బాధతోనూ "నొప్పి, నొప్పి" అంటూ అరుస్తున్నాడు.

ఎంత ఓదార్చినా ఊరుకోవడంలేదు. వాన్ని ఒళ్లో కూర్చోబెట్టుకొని మిసెస్ రావు బేలగా కూర్చుంది. డాక్టరు రావు అనిశ్చితంగా, అసహనంగా అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. మనసంతా అస్తవ్యస్తంగా తయారయింది. ఏకైక వంశోద్ధారకుని గురించిన కంగారుతో అతనికంతా చీకాకుగా ఉంది.

ఇంత చిన్న గాయానికే కొడుకెందుకంతగా ఏడ్చుతున్నాడో అర్థంకాలేదు అతనికి. తన వైద్యం మీద తనకే మొదటిసారిగా అపనమ్మకం కలిగింది. 'ఎక్కడుంది లోపం?' అని తనలో తనే ప్రశ్నించుకున్నాడు.

"నాన్నా" ఏడ్చుతూనే కొడుకు పిలిచాడు.

"ఏంటి నాన్నా, తక్కువయిందా," అంటూ ఆనందంగా కొడుకుకేసి కదిలాడు.

"పాపం, మన డాన్ ఆ పిల్లాన్ని నా కంటెకూడా ఎక్కువ కరచింది కదూ నాన్నా."

కొరడాతో కొట్టినట్లుగా ఉలిక్కి



పడ్డాడు డాక్టరు రావు. అతనికి ఉదయం జరిగిన సంఘటన జ్ఞాపకం వచ్చింది. ఆ తరువాత అతనిలో అంతర్మథనం మొదలైంది.

* * *

ఓ నిర్ణయానికి వచ్చినవానిలా సెల్ఫ లోంచి మెడికల్ కిట్ అందుకున్నాడు డాక్టరు రావు.

ప్రశ్నార్థకంగా అతనివంక చూసింది శ్రీమతి. "ఇప్పుడే వస్తాను." అంటూ

బయటకు నడిచాడు.... గారేజిలోంచి కారును బయటకు కదిలించాడు.

అతనికి తెలుసు ఆ చిన్న నగరంలో బిచ్చగాళ్లు ఉండే దెక్కడో!

కారును నేరుగా ఆ గుడిసెల ముందు ఆపాడు. కారులైట్ల వెలుతురుకు గుడిసెల్లోంచి జనం బయటకు వచ్చారు. వాళ్లల్లోంచి ఒకరిని అడిగాడు.

"ఈరోజే మీలో ఒకామె కొడుకును కుక్క కరిచింది. వాళ్లు వచ్చి రెండు మూడు రోజులే అయిందట. ఎక్కడుంటుందావిడ."

"ఓహో సెంద్రినా బాబూ, రండి చూపిస్తా."

అతనితో వెళ్తుంటే వెనకనుంచి ఎవరో "డాక్టరుబాబు" అని చిన్నగా అంటున్నారు.

గుడిసెలో సెంద్రికొడుకు చిన్నగా ఏడుస్తూ ఉన్నాడు. వాడి కాలుకు బట్ట కట్టి ఉంది.

బ్యాటరీ లైటుతో వచ్చిన డాక్టరు రావునుచూసి సెంద్రి అదిరిపడి బయటకు వచ్చింది.

"నీ కొడుకును మా కుక్క కరిచిందిగా. ఏ డాక్టరు వద్దకయినా తీసికెళ్లావా?"

"లేదయ్యా రక్తం కారకుండా నేనే బట్టకట్టాను."

"వాణ్నిటు తీసుకురా."

కంగారుగా వాణ్ని ఎత్తుకొని వచ్చింది. అతడు వాడి కాలుకు కట్టిఉన్న ఆ బట్టనువిప్పి, మెడికల్ కిట్ తెరచాడు. స్పిరిట్‌తో ఆ గాయాన్ని శుభ్రంగా కడిగి బ్యాండేజి కడుతూ, "వేడినీళ్లు తీసుకురామ్మా, ఇంజక్షన్ ఇస్తాను." అన్నాడు.

వేడినీళ్లు తెచ్చింతరువాత ఇంజక్షన్ ఇచ్చి "రేపు దవాఖానాకు తీసుకురా, వరుసగా ఇంకో వారం రోజులయినా ఇంజక్షన్ ఇవ్వాలి" అని అక్కన్నుంచి నడిచాడు.

"నీ పిల్లల్ని దేవుడు సల్లంగ సూడాలి బాబూ" అని అంటున్న సెంద్రి మాటలు వెనకనుంచి వినబడి డాక్టరు రావు పెదాలపై అప్రయత్నంగా చిరునవ్వు ప్రత్యక్షమయింది.

కారులో ఇంటికెళ్తున్న డాక్టరు రావు కిప్పుడు ఎంతో హాయిగా ఉంది. అంతకు ముందున్న అసహనం, చీకాకు అంతా మటుమాయమైనాయి. ఏదో పెద్ద తప్పును సరిదిద్దుకున్న వానిలా సంతోషంగా ఫీలవుతున్నాడు.

తన కొడుకు జ్ఞాపకం వచ్చాడు. తను ఇంటికెళ్లేసరికి "నాకు తక్కువైపోయింది నాన్నా, నౌ అయామ్ ఆల్ రైట్" అంటూ నవ్వుతూ కొడుకు తనకు ఎదురొస్తున్నట్లుగా ఊహించుకుంటున్నాడు డాక్టరురావు.

———